ఈ-పేపర్ తెలుగు డైలీ

# ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/




విలేకరులు కావలెను

RNI NO T/TG/2024/1093

Cell : 7013794396

అతితక్కువ కాలంలో 65వేలకు పైగా రీడర్ల మనసు దోచుకున్న ఇయ్యాల్టి న్యూస్ లోకల్ 2 గ్లోబల్ ... ఈ పేపర్ డైలీ పత్రికలో పని చేయుటకు తెలంగాణ వ్యాప్తంగా విలేకరులు కావలెను. కనీస విద్యార్హత కలిగి జర్నలిజంపె ఆసక్తి, తెలుగులో టైప్ చేయగలవారై ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలతో పాటు అన్ని మండలాల వారిగా విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత.. ఆసక్తి ఉన్న వారు వెంటనే సంప్రదించండి.

OFFICE ADDRESS
RRR MEDIA, PATELNGAR, AMBARPET, HYD-500013
email id.ramannews9@gmail.com





కవితకు బెయిల్‌పై పోస్టులు... రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు 2లో



ప్రధాని నరేంద్రమోదీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ..వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించాలని వినతి 2లో



అదిరిపోయే “వందే భారత్ స్లీపర్ ట్రైన్” ఫీచర్లు.. మీరు ఓ లుక్కేయండి 3లో



వ్యవసాయానికి టెక్నాలజీ జోడింపు.. రైతాంగం కోసం కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు 3లో



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణం సుందరయ్యనగర్‌లో నివాసాలను చుట్టుముట్టిన వరద నీరు



ఖమ్మం నగరంలో మున్నేరు ఉగ్రరూపం



సూర్యాపేట జిల్లా కోదాడ సమీప మఠంపల్లి రోడ్డులో కల్వర్టులోకి కొట్టుకుపోయిన లారీ, ఆటో

# పల్లె.. పట్నం.. అంతా ఆగమాగం

- కుంభవృష్టితో రాష్ట్రం అతలాకుతలం
- 16 మంది మృతి.. ఐదుగురికిపైగా గల్లంతు ...
- ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో భారీ నష్టం

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 2: వర్షం విలయం సృష్టించింది. మిన్నుమన్నూ ఏకమైనట్లుగా కుంభవృష్టి కురవడంతో రాష్ట్రంలో జనజీవనం అతలాకుతలమైంది. వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లి గ్రామాలు, కాలనీల్లోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తాయి. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లింది. మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల ముంపు ఏర్పడింది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగు పోటెత్తి.. ఖమ్మం నగరాన్ని ముంచింది. 15 కాలనీల్లో ఇళ్లు మునిగాయి. మహబూబాబాద్ జిల్లా జలదిగ్బంధంలో చిక్కుకుంది. జిల్లా కేంద్రం నీటి మునిగింది. మహబూబాబాద్ జిల్లాలో ఇంటికన్నె-కేసముద్రం స్టేషన్ల మధ్య కిలోమీటరు మేర, మహబూబాబాద్-తాళ్లపూసపల్లి స్టేషన్ల మధ్య సుమారు 300 మీటర్ల మేర ట్రాక్ కోతకు గురైంది. ఈ మార్గంలో 24 రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి వద్ద రైలు పట్టాల కింద కట్ట కోతకు గురైంది. రాష్ట్రంలో అనేక చోట్ల వర్షాలు, ఈదురుగాలులకు ఇళ్లు, గోడలు, చెట్లు కూలాయి.



హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ నల్లబండగూడెం వద్ద వరద ప్రవాహం



ఖమ్మం నగరంలో ముంపు ప్రాంతం నుంచి ఓ మహిళను తరలిస్తున్న యువకుడు

# మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా

## ఎకరాకు ఎన్ని వేల పరిహారమంటే..?



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 2: తెలంగాణలో వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి.. ఈ క్రమంలో భారీ వర్షాలు, వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున నష్టపరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. గతంలో రూ. 4 లక్షలుగా ఉన్న నష్టపరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే, కంటింజెన్సీ ఫండ్ కింద వర్షాలు, వదరలతో అతలాకుతలమైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లా కలెక్టర్లకు ఒక్కొక్కరికి రూ.5 కోట్లు వెంటనే విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలపై హైదరాబాద్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. చనిపోయిన పాడి గేదెలు ఒక్కో దానికి ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ. 30 వేల నుంచి రూ. 50 వేలకు పెంచాలని, మరణించిన మేకలు, గొర్రెలకు ఒక్కోదానికి ఇచ్చే రూ. 3 వేల సాయం రూ.5 వేలకు పెంచాలని సీఎం ఆదేశించారు. తక్షణం బాధిత కుటుంబాలకు అందించాలని సూచించారు. వర్షాలు, వరదల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న పంటలకు ఒక్కో ఎకరానికి రూ. 10 వేల చొప్పున పంట నష్ట పరిహారం అందించేందుకు తక్షణ ఏర్పాట్లు చేయలని ఆదేశించారు.రాష్ట్రంలోనే కాకుండా, జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు 24 గంటలు పని చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని చెప్పారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, నిత్యావసర వస్తువుల పంపిణీ, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలతో వాటిల్లిన నష్టంపై అన్ని విభాగాల నుంచి ప్రాథమిక నివేదికలు తెప్పించి, కేంద్ర ప్రభుత్వం నుంచి తక్షణ సాయం కోరేందుకు నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

### నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరానికి రూ.10వేలు పరిహారం ఇస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి



ఇయ్యాల్టి న్యూస్, ఖమ్మం, సెప్టెంబర్ 2: వరదల వల్ల ఖమ్మం జిల్లా తీవ్రంగా నష్టపోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 40 సెంటీమీటర్ల వర్షాన్ని ఎప్పుడూ చూడలేదని ప్రజలు అంటున్నారని తెలిపారు. ఖమ్మం జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పంటనష్టం వివరాలు సేకరిస్తున్నామని, పరిహారం ప్రకటిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరానికి రూ.10 వేలు పరిహారం ఇస్తామని తెలిపారు. వరద బాధిత కుటుంబాలకు తక్షణం రూ.10 వేలు ఇస్తామని వెల్లడించారు. వరదల వల్ల రాష్ట్రంలో రూ.5,430 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని పేర్కొన్నారు. విపత్కర పరిస్థితుల్లో కేంద్రం పెద్దన్న పాత్ర పోషించి రాష్ట్రానికి సాయం చేయాలని సీఎం కోరారు. ప్రధాని స్వయంగా వచ్చి నష్టాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ విపత్తుగా పరిగణించి వెంటనే నిధులు ఇవ్వాలని కోరినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు.

# నిండుకుండలా హుస్సేన్ సాగర్.. జీహెచ్ఎంసీ అలర్ట్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 2:ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో హుస్సేన్ సాగర్‌లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. బంజారా, పికెట్, కూకట్‌పల్లి, బుల్కాపూర్ నాలాల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు హుస్సేన్ సాగర్ లోకి వచ్చి చేరుతోంది. ఈ వరద నీటితో హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటింది. ఎఫ్‌టీఎల్‌కు చేరుకోవడంతో ఇప్పటికే అధికారులు నాలుగు గేట్లు ఎత్తి దిగువన ఉన్న మూసీ నదికి నీటిని వదిలారు. దీంతో సిటీ ప్రజలకు జీహెచ్ఎంసీ నిన్నటి నుంచి అలర్ట్ జారీచేస్తోంది. హుస్సేన్ సాగర్ వరద నీటి పరిస్థితిని జీహెచ్ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వర్షం దంచికొట్టింది. గచ్చిబౌలిలో అత్యధికంగా 97 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ అధికారులు వెల్లడించారు. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

# తెలంగాణకు తప్పిన భారీ వానగండం

## కానీ..మరో 3 రోజుల్లోనే ఇంకో ముప్పు..!



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 2 :ఎడతెరపిలేని భారీ వర్షాలతో అతలాకుతలం అవుతున్న తెలంగాణకు వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త వినిపించింది. తెలంగాణ భారీ వాన గండం తప్పిందని పేర్కొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయిగుండం.. క్రమంగా బలహీన పడుతోందని తెలిపింది వాతావరణ కేంద్రం. తూర్పు విదర్భ- రామగుండం దగ్గర కేంద్రీకృతమైన వాయుగుండం.. రాగల 12 గంటల్లో పూర్తిగా బలహీన పడనున్నట్టు పేర్కొంది. అయినప్పటికీ.. తెలంగాణలో సోమవారం పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు.. మంగళవారం నుంచి రాబోయే 5 రోజుల పాటు అంటే సెప్టెంబర్ 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక.. హైదరాబాద్‌లో కూడా మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. దీంతో.. తెలంగాణకు ఐఎండీ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉంటే.. రెండు తెలుగు రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ మరో హెచ్చరిక జారీ చేసింది. సెప్టెంబర్ 5 నాటికి పశ్చిమ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్ నుంచి తెలంగాణ మీదుగా ఈ ఉపరితల ద్రోణి కొనసాగనుందని అధికారులు వివరించారు. కోస్తాంధ్ర తీరానికి అతి చేరువలో ఏర్పడే అల్పపీడనం వల్ల ఏపీ, తెలంగాణలో మళ్లీ భారీ వర్షాలు కురిసే ముప్పు పొంచి ఉందని అధికారులు హెచ్చరించారు.

# వరద సమయంలో బురద రాజకీయాలా..?

## బీఆర్ఎస్ పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 2: వరదల్లో బీఆర్ఎస్ బురద రాజకీయం చేస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాలో ఉండి ఒకాయన ట్విట్టర్‌లో పోస్టు పెడుతున్నాడని, ఒకాయన ఫాంహౌస్‌లో ఉన్నాడని సీఎం బీఆర్ఎస్ పార్టీని ఉద్దేశించి విమర్శించారు. వరద సమయంలో బురద రాజకీయాలు వద్దని సూచించారు. బెయిల్ కోసం 20మంది ఎమ్మెల్యేలతో ఢిల్లీ వెళ్లారు కానీ వరద బాధితులను పరామర్శించరని మండిపడ్డారు. సోమవారం సూర్యాపేట జిల్లా మోతె గ్రామంలో సీఎం పర్యటించారు. సూర్యాపేట జిల్లాలో వరదల కారణంగా జరిగిన పంట, ఆస్తి నష్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున సాగర్ ఎడమ కాల్వ తెగిపోవడం వల్ల జరిగిన పంట నష్టం గురించి తెలుసుకున్నారు. ప్రజలను తక్షణం ఆదుకునేలా జిల్లా కలెక్టర్‌కు రూ. 5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన సీఎం రేవంత్.. పశువులు కోల్పోయినవారికి కూడా ప్రభుత్వం నుంచి సాయం అందుతుందని భరోసా ఇచ్చారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారని, అందువల్లే నష్టం తగ్గిందన్నారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని వరద బీభత్సాన్ని ప్రధానికి వివరించామని తెలిపారు. రాష్ట్రంలో పర్యటించాల్సిందిగా ప్రధాని మోడీతోపాటు పాటు ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీకి సైతం విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం అందజేస్తుందని సీఎం హామీ ఇచ్చారు. పాఠశాల సెలవులపైన జిల్లా కలెక్టర్ల కే నిర్ణయాధికారం ఇచ్చామని చెప్పారు.



# ప్రయాణికులకు అలర్ట్..

## 1400 బస్సులు రద్దు చేసిన టీజీ ఆర్టీసీ

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 2: గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తెలంగాణ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వరదలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. ఈ క్రమంలో తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. వదల కారణంగా చాలా ప్రాంతాల్లో రహదారుల కొట్టుకుపోయాయి. దీంతో తెలుగు రాష్ట్రాల్లో నడిపే 1400 బస్సులను రద్దు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సుల్లో అత్యధికంగా ఖమ్మం, విజయవాడ, మహబూబాబాద్ వైపు వెళ్లే బస్సులు ఉన్నట్లు తెలిపారు. అలాగే మరికొన్ని బస్సులను రూట్ మార్చి నడుపుతున్నామని.. అందులో విజయవాడకు వెళ్లే బస్సులను సూర్యాపేట మీద నుంచి కాకుండా గుంటూరు మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. అలాగే వర్షాలతో పాటు వరదలు తగ్గగానే బస్సు సర్వీసులను పునరుద్ధరిస్తామని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు.

# ఇయ్యాల 11 జిల్లాల్లో భారీ వర్షాలు

## స్కూళ్లకు సెలవులపై కీలక ఆదేశాలు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 2: తెలంగాణలోని దాదాపు 11 జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరించినందున ఆయా జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. భారీ వర్షాలు కురిసే హెచ్చరికలున్న 11 జిల్లాలైన ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కొమరంభీం ఆసిఫాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నిర్మల్, నిజామాబాద్, పెద్దపెల్లి, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయా జిల్లాల్లో వరదల పరిస్థితి, పునరావాస, సహాయక చర్యలను సమీక్షించారు. సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురిసే అవకాశమున్న ఈ జిల్లాల కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని ఏ విధమైన ఆస్తి, ప్రాణ నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.స్కూళ్లకు సెలవులపై కలెక్టర్లు నిర్ణయం తీసుకోవాలని ఆమె సూచించారు.

హైదరాబాద్, రాజన్న సిరిసిల్ల, మహబూబ్ నగర్, జనరల్

ఈ-పేపర్ తెలుగు డైలీ

# ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/




## ఇంట్లో వరద నీరు.. కళ్లల్లో కన్నీరు.. హరీశ్‌రావు ట్వీట్




ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 2:రాష్ట్రంలో కుండపోతగా కురిసిన వర్షాలకు ప్రజలు కష్టాల్లో ఉన్నారు.. సహాయక చర్యల కోసం ఆర్తిగా ఎదురుచూస్తున్నారు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇంట్లో వరద నీరు.. కళ్లల్లో ఎడతెగని కన్నీరు ప్రవహిస్తుందన్నారు. వరద సృష్టించిన విలయాన్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతుందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం కొంతకాలం శుష్క రాజకీయాలు, కూల్చివేతలను ఆపి బాధితులను ఆదుకోవడం పై సంపూర్ణంగా దృష్టి కేంద్రీకరించాలని హరీశ్‌రావు సూచించారు. ఇప్పటికే తక్షణ సహాయ చర్యలు అందలేదని జనం తమ ఆవేదన, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం బాధ్యతాయుతంగా మనసుపెట్టి చర్యలు తీసుకోవాలి. వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలి. విద్యుత్ సరఫరాను పునర్దరించాల్సిన చోట వేగంగా చర్యలు తీసుకోవాలి. ఆహారం, నీరు అందుబాటులో ఉంచాలి. అసలే రాష్ట్రం విష జ్వరాలతో విలువిలలాడుతున్నది. వరదల వల్ల మరింత విజృంభించే ప్రమాదం ఉంది. అన్ని శాఖలు అప్రమత్తం కావాలి. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. ఎకరానికి పదివేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటన..అధికారుల తీరుపై తీవ్ర అసహనం



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, సెప్టెంబర్ 2: భారీ వర్షాలు, వరదలు.. కృష్ణా నదిలో వరద ఉధృతితో.. విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి.. ఇక, వరుసగా వర్షాలు, వరదలపై సమీక్షలు నిర్వహిస్తూ.. ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. అవకాశం దొరికినప్పుడల్లా.. వరద ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటనకు వెళు_న్నారు.. సోమవారం రెండు గంటలపాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు సీఎం చంద్రబాబు.. రామలింగేశ్వర నగర్, జక్కంపూడి కాలనీ, సింగ్ నగర్ ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటన కొనసాగగా.. సహాయక చర్యలను పరిశీలించారు.. ఆహారం అందుతుందా..? లేదా..? అనే అంశంపై ఆరా తీశారు.. రెండు గంటల పర్యటన అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలక్టరేట్ కు చేరుకున్న చంద్రబాబు%ౌ% కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, అనిత, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, కొండపల్లి శ్రీనివాసరావు, కొల్లు రవీంద్ర సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. రెండు గంటల పాటు క్షేత్ర స్థాయి పర్యటన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు.. సహాయక చర్యల్లో అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.. అధికారులకు లెఫ్ట్ అండ్ రైట్ వాయించారు.. తానే స్వయంగా రంగంలోకి దిగినా అధికారుల మొద్దు నిద్ర వీడకుంటే ఎలా అంటూ అధికారులకు క్లాస్ తీసుకున్నారు చంద్రబాబు నాయుడు.

## కూల్చివేతలు ఆపిన హైడ్రా.. ఎందుకంటే...!



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 2:హైదరాబాద్ లోని అక్రమ కట్టడాలను తొలగిస్తూ ప్రజల మెప్పు పొందిన 'హైడ్రా' ప్రస్తుతం కూల్చివేతలను ఆపింది. ఇప్పటికే పలు అక్రమ కట్టడాలను గుర్తించినప్పటికీ వాటిని తొలగించే పనిని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు హైడ్రా చీఫ్ రంగనాథ్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాలు నీటమునగడం, సాయం కోసం ప్రజలు ఎదురుచూస్తుండడంతో తమ పనిని ఆపేశామని చెప్పారు. తమ బృందాలు జీహెచ్ఎంసీ మాన్ సూన్ సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని వివరించారు. వర్షాలు తగ్గుముఖం పట్టాకే ఆక్రమణల తొలగింపు మొదలుపెడతామని వివరించారు. వర్షాలకు నీట మునిగిన ప్రాంతాల్లో రంగనాథ్ పర్యటిస్తున్నారు. ముఖ్యంగా చెరువులు, కుంటల పక్కనే ఉన్న కాలనీలలో పర్యటిస్తూ, స్థానికులను అడిగి అక్కడి పరిస్థితికి కారణాన్ని తెలుసుకుంటున్నారు. చెరువుల పక్కన నిర్మించిన కాలనీలపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇక ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లలోని అక్రమ నిర్మాణాలకు ఇరిగేషన్, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. వారం రోజుల్లోగా ఇళ్లు ఖాళీ చేయాలని అందులో హెచ్చరిస్తున్నారు.

## వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షలు నష్ట పరిహారం ప్రకటించాలి: కేటీఆర్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 2: రాష్ట్రంలో వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కేవలం రూ. 5 లక్షలు నష్టపరిహారం ప్రకటించటం అన్యాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాగా మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు నష్ట పరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి గారే వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు పరిహారం అందిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్నారు.. మీరిచ్చిన మాటను నిలబెట్టుకొని రూ. 25 లక్షలు పరిహారం ప్రకటించండంటూ కేటీఆర్ డిమాండ్ చేశారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాల్సిన అవసరముందని అన్నారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు కూడా ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే అంతకన్నా మోసం మరొకటి ఉండదు సీఎంపై విరుచుకుపడ్డారు. అదే విధంగా వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన, డ్యామేజ్ అయిన వారికి రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు సాయం చేస్తామన్నారని, ఆ హామీని కూడా నెరవేర్చండని కేటీఆర్ అడిగారు. ప్రభుత్వ అసమర్థత, చేతగానితనం, ముందస్తు ప్రణాళిక లేకపోవటం కారణంగానే ప్రాణనష్టం జరిగిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వరదలో మునిగిపోయిన విజయ డెయిరీ.. 70 కోట్ల నష్టం...!



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, సెప్టెంబర్ 2: భారీ వర్షాలు, వరదలతో విజయవాడ నగరం చెరువును తలపిస్తోంది. చాలా ప్రాంతాలు నీట మునిగిపోయాయి. ఈ క్రమంలోనే చిట్టినగర్‌లో ఉన్న విజయ డెయిరీ కూడా నీట మునిగింది. రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా ఆదివారం రాత్రి వరద ఉధృతి పెరగడంతో విజయ డెయిరీలోకి భారీగా నీరు వచ్చి చేరింది. డెయిరీకి సంబంధించిన మెషిన్లు, వాహనాలు కూడా ముంపునకు గురయ్యాయి. వరద నీరు చేరడంతో డెయిరీ లోపల ఉన్న పాలు, పాల ఉత్పత్తులు అన్నీ పాడైపోయాయి. దీంతో సుమారు 70 కోట్ల మేర నష్టం వాటిల్లింది. డెయిరీలోకి నీళ్లు రావడం వల్ల రెండు రోజుల పాటు అందులోకి అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొందని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. చిట్టినగర్‌కు ప్రత్యామ్నాయంగా వీరవల్లి కొత్త యూనిట్‌లో పూర్తిస్థాయి కార్యకలాపాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## కవితకు బెయిల్‌పై పోస్టులు... రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, సెప్టెంబర్ 2: ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి సోమవారం సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కవితకు బెయిల్ వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టులపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాంగ్రెస్ ప్రశ్నిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది.కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చిన సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టులపై సుప్రీంకోర్టు వివరణ అడిగింది. కవిత బెయిల్ అంశంపై సోషల్ మీడియా పోస్టులను సీరియస్‌గా తీసుకుంది.కవితకు బెయిల్ వచ్చిందా? ఇచ్చారా? అంటూ తెలంగాణ కాంగ్రెస్ పోస్ట్ చేసింది. కమలంతో స్నేహం... కవితక్కకు మోక్షం అంటూ పేర్కొంది. తెలంగాణ కాంగ్రెస్ పోస్టులపై వివరణ ఇవ్వాలంటూ పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆయనకు రెండు వారాల గడువును ఇచ్చింది

## గుడుల పూజారులకు ప్రతి నెలా గౌరవ వేతనం

### అందజేసిన ఎమ్మెల్యే కాలేరు



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, సెప్టెంబర్ 2: నియోజకవర్గంలోని పలు గుడుల్లో పూజలు చేస్తోన్న పేద పూజారులకు ప్రతి నెల ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గౌరవ వేతనం అందజేస్తున్న విషయం తెలిసిందే.. కాగా సోమవారం గోల్నాక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెలకు సంబంధించి 15 మంది పూజారులకు ఒకొక్కరికీ రూ. 5వేల చొప్పున మొత్తం రూ. 75 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే కాలేరు అందజేశారు. ఈ సందర్భంగా పూజారులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.



## ఏపీ వరద బాధితులకు ఆహార పంపిణీ రంగంలోకి దిగిన హెలికాప్టర్లు..

ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, సెప్టెంబర్ 2: ఏపీ వరద బాధితులకు ఆహార పంపిణీ కోసం రంగంలోకి దిగాయి హెలికాప్టర్లు. ప్రస్తుతం రెండు హెలికాప్టర్ల ద్వారా బుడమేరు ముంపు ప్రాంతాల్లో బాధితులకు ఆహారం అందిస్తున్నాయి ఎన్టీఆర్ఎఫ్ బృందాలు.. ఇప్పటి వరకు 3 టన్నులకు పైగా ఆహారం, నీళ్లు బాధితులకు అందజేశారు.. బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, బ్రెడ్, ఫ్రూట్ జ్యూస్, టెట్రాప్యాక్స్, ఇతర ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్నారు.. హెలికాప్టర్ల ద్వారా బాధితుల ఇళ్లపై ఆహార ప్యాకెట్లను జారవిడుస్తున్నారు సిబ్బంది. మరో రెండు హెలికాప్టర్లు కూడా సహాయక చర్యలు, సేవ కార్యక్రమాల్లోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు..

## ప్రధాని నరేంద్రమోదీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

### వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించాలని వినతి



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 2: భారీ వర్షాలు, వరదల కారణంగా తెలంగాణ అతలాకుతలమైంది. వేలాది బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో, తెలంగాణలో కురిసిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాశారు. తెలంగాణలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. తెలంగాణకు తక్షణ సాయం అందించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి వర్షాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాలు, రోడ్లపై నీరు నిలిచిన నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని నగర కమిషనర్లను సీఎం ఆదేశించారు. దెబ్బతిన్న రోడ్లకు ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన మరమ్మతులు నిర్వహించాలన్నారు. విద్యుత్ సరఫరా సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

## ఎమెల్సీ కోదండరాంను కలిసిన రాష్ట్ర వంజరి సంఘం నాయకులు



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, సెప్టెంబర్ 2: ఇటీవల ఎమ్మెల్సీ గా ప్రమాణస్వీకారం చేసిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కోదండరాం ను తెలంగాణ వంజరి సంఘం నాయకులు కలిసారు. సోమవారం హైదరాబాద్ తార్నాక లోని తన స్వగృహంలో తెలంగాణ వంజరి ఎస్టీ రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు కాలేరు రామోజీ నేతృత్వంలో కోదండరామ్ ను వంజరి సంఘంప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో వెనుక బడి ఉన్న వంజరులను తిరిగి ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోదండరాంను కోరారు. కోదండరాంను కలిసిన వారిలో కాలేరు అమరేందర్, లక్ష్మినారాయణ, ఎదుగని శ్రీరాములు, సాల్వేరు అర్జున్, అనిల్, ఖమ్మం వెంకటేశ్వర్లు, ధర్మరాజు, రవీందర్ తదితరులు ఉన్నారు.**

నేషనల్, ఇంటర్నేషనల్ , క్రైం, వైరల్ న్యూస్
ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
మంగళవారం 03 సెప్టెంబర్ 2024


# సరికొత్త గరిష్ఠాల వద్ద ముగిసిన సూచీలు




ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్, సెప్టెంబర్ 2: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం నాడు భారీ లాభాల్లో ముగిశాయి. సూచీలు మరోసారి సరికొత్త గరిష్ఠాల వద్ద ముగిశాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ రంగ స్టాక్స్ మంచి లాభాలు నమోదు చేశాయి. సెన్సెక్స్ 194 పాయింట్లు లాభపడి 82,560 వద్ద, నిఫ్టీ 43 పాయింట్లు ఎగిసి 25,279 పాయింట్ల వద్ద స్థిరపడ్డాయి. 1,684 షేర్లు లాభాల్లో... 2,191 షేర్లు నష్టాల్లో ముగియగా, 133 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. నిఫ్టీలో బజాజ్ ఫిన్ సర్వ్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఆటో, హీరో మోటో కార్ప్ టాప్ గెయినర్స్‌గా నిలవగా... గ్రాసిమ్ ఇండస్ట్రీస్, కోటక్ మహీంద్రా బ్యాంకు, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కోల్ ఇండియా, నెస్లే ఇండియా టాప్ లూజర్స్‌గా నిలిచాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగాలు మినహా మిగిలినవన్నీ నష్టాల్లోనే ముగిశాయి.క్యాపిటల్ గూడ్స్, మెటల్, హెల్త్ కేర్, టెలికం, మీడియా రంగాలు 0.4 శాతం నుంచి 1.6 శాతం మేర నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ సూచీ ఫ్లాట్‌గా ముగియగా, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం మేర క్షీణించింది. సూచీలు ఈ రోజంతా లాభాల్లోనే కొనసాగాయి.

## చీరకట్టులో మహిళల జిమ్ వర్కవుట్స్.. నెట్టింట వైరల్..!



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 2: ఆరోగ్యం, అందం కోసం చాలామంది జిమ్‌కి వెళుతుంటారు. అయితే జిమ్‌లో వర్కవుట్స్ చేయాలంటే వదులుగా, సాగే లక్షణం ఉన్న ప్రత్యేక దుస్తులను ధరిస్తారు. కానీ ఇక్కడ కొందరు మహిళలు మాత్రం సంప్రదాయ చీర కట్టులోనే వ్యాయామం చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. వీరి వర్కవుట్స్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో చీరలు ధరించిన కొందరు మహిళలు జిమ్‌లొ సీరియస్‌గా ఎక్సర్‌సైజులు చేస్తున్నారు. ఈ మహిళలపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. చీర కట్టుకుని జిమ్‌లో వ్యాయామం చేయడం కొంచెం కష్టమే. చీర కట్టుకుని జిమ్‌లో పరికరాలను ఉపయోగించడం అంత సులభం కాదు. అయితే జాగ్రత్తలు తీసుకుంటే మాత్రం జిమ్‌లో వ్యాయామం అసాధ్యం కాదు. అయితే ఈ మహిళలు రోజూ చీరకట్టులో వర్కవుట్స్ చేసేవాళ్లు కాదని, కేవలం రీల్స్ కోసం వాళ్లు ఇలా చీరకట్టులో జిమ్‌లో వ్యాయామం చేశారని కొందరు నెటిజన్‌లు విమర్శిస్తున్నారు. ఈ స్టంట్స్ అన్ని రీల్స్, వ్యూస్ కోసమే అంటున్నారు. వాళ్లు చేసింది పబ్లిసిటీ కోసమే అయితే మాత్రం అందులో తప్పేముందని మరికొందరు నెటిజన్‌లు విమర్శిస్తున్నారు. ఈ వీడియోను ఇప్పటివరకు 1.2 మిలియన్ మంది వీక్షించారు.

## అదిరిపోయే 'వందే భారత్ స్లీపర్ ట్రైన్' ఫీచర్లు.. మీరు ఓ లుక్కేయండి



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 2: భారతీయ రైల్వే మరింత అధునాతనంగా తయారవుతోంది. ఇప్పటికే కేంద్రం ప్రభుత్వం వందేభారత్ రైళ్లను తీసుకువచ్చింది. ప్రయాణికులు మరింత తొందరగా గమ్యస్థానం చేరేందుకు ఈ రైళ్లను దేశవ్యాప్తంగా పలు మార్గాల్లో ప్రారంభించారు. ఇదిలా ఉంటే తాజాగా వందేభారత్ స్లీపర్ రైళ్లు కూడా ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ప్రపంచ స్థాయి ఫీచర్లను ఈ కొత్త రైళ్లలో అందిస్తున్నారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆదివారం బెంగళూర్‌లోని బీఈఎంఎల్‌లో కొత్త వందేభారత్ స్లీపర్ కోచ్‌లను పరిశీలించారు. ప్రస్తుతం వందేభారత్ స్లీపర్ మూడు నెలల్లో ప్రారంభిస్తామని చెప్పారు. వందేభారత్, చైర్ కార్ వందేభారత్ మెట్రో, వందేభారత్ స్లీపర్, అమృత్ భారత్ అనే నాలుగు కాన్ఫిగరేషన్లలో త్వరలో దేశంలో మెరుగైన రైలు సేవల్ని అందిస్తాయని ఆయన అన్నారు. ప్రజల నుంచి తీసుకున్న ఫీడ్‌బ్యాక్‌తో వందేభారత్ ప్రతీ వెర్షన్‌ని మెరుగుపరుస్తున్నామని చెప్పారు.వందే భారత్ స్లీపర్ రైలు సెట్ స్టెయిన్‌లెస్-స్టీల్ నిర్మాణాన్ని కలిగి ఉంది. ప్రయాణికుల భద్రతను పెంచడానికి మరిన్ని ఫీచర్లను జోడించారు. ప్రత్యేకంగా రూపొందించిన క్రాష్ బఫర్‌లు, కప్లర్‌ల వంటి అధునాతన క్రాష్‌వర్తీ ఎలిమెంట్లు అమర్చబడ్డాయి. ట్రెయిన్ కఠినమైన అగ్నిప్రమాదాలను కూడా తట్టుకునేలా రూపొందిచారు. స్లీపర్ ట్రైన్‌లో మొత్తం 16 కోచ్‌లు ఉన్నాయి. ఇందులో 11 ఏసీ త్రి టైర్ కోచుల్లో 611 బెర్తులు, 4 ఏసీ టూ టైర్ కోచుల్లో 188 బెర్తులు, ఏసీ ఫస్ట్ క్లాస్‌లో 24 బెర్తులు ఉన్నాయి. వందేభారత్ స్లీపర్ కోచ్ మరింతగా అప్‌గ్రేడ్ అవుతోంది. ఇంటీరియర్స్ ప్యానెల్స్, సీట్లు, బెర్తులు అన్ని కొత్తగా ఉన్నాయి. ఎలక్ట్రికల్, ప్రొపల్షన్, బోగీలు, ఎక్స్‌టీరియర్ ప్లగ్ డోర్లు, బ్రేక్ సిస్టమ్‌లు మరియు హెచ్ వీ ఏసీ వంటి కీలకమైన సిస్టమ్‌ల ఉన్నాయి. గంటలకు 160 కి.మీ వేగంతో పరుగు తీసేలా రూపొందించారు.

## రూ.10 వేలు ఇస్తేనే కాపాడేది..!

### గజ ఈతగాడి దురాశకు నిండు ప్రాణం బలి.. ఎక్కడంటే..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 2:కాపాడేందుకు 10వేలు డిమాండ్ చశాడు ఓ గజ ఈతగాడు.. ఇందుకు అంగీకరించిన బాధితుడు బంధువులు ఆన్‌లైన్‌లో డబ్బు బదిలీ చేశారు. కానీ, మనీ ట్రాన్స్‌ఫర్ అయ్యేందుకు సమయం పట్టింది. డబ్బులు ముడితేనే మనిషిని కాపాడేది అని ఆ గజ ఈతగాడు తేల్చి చెప్పాడు. ఇంతలోనే నదిలో పడ్డ వ్యక్తి వరద ఉధృతికి కనిపించకుండా కొట్టుకుపోయాడు. ఈ విషాద సంఘటన యూపీలో చోటు చేసుకుంది. మృతుడు ఉత్తరప్రదేశ్ ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ అని తెలిసింది. పూర్తి వివరాల్లోకి వెళితే%ొ%సమాచారం మేరకు ఉత్తరప్రదేశ్ ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆదిత్య వర్ధన్ సింగ్ ఆదివారం తన మిత్రులతో కలిసి ఉన్నావ్‌లోని నానామావ్ ఘాట్ వద్ద గంగా నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. అనుకోకుండా వరద ప్రవాహం పెరగడంతో ఆయన నీటిలో మునిగిపోయారు. అక్కడే ఉన్న గజ ఈతగాడు సునీల్ కాశ్యప్ సాయం చేసేందుకు ముందుకు వచ్చాడు. కానీ, అందుకోసం డబ్బు డిమాండ్ చేశాడు. ఆన్‌లైన్‌లో రూ.10,000 తనకు బదిలీ అయ్యే వరకు తాను బాధితుడిని కాపాడబోనని చెప్పాడు. సదరు అధికారి సింగ్ నదిలో కొట్టుకుపోతూ ఉంటే, రూ.10,000 తనకు బదిలీ అయ్యే వరకు సునీల్ వేచి చూశాడు. దీంతో ఆయన నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.ప్రమాదం జరిగిన తర్వాత ఉన్నతాధికారులు ఘటనాస్థలిని సందర్శించారు. గల్లంతైన సింగ్ కోసం డైవర్లు బోటులో వెతికారు. అయితే, మృతదేహం లభ్యం కాలేదని, గాలింపు కొనసాగుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## వరద సహాయ చర్యల్లో పార్టీ శ్రేణులు పాలుపంచుకోవాలి

### రాహుల్ గాంధీ




ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, సెప్టెంబర్ 2: తెలంగాణ, ఏపీలో వరద పరిస్థితిపై కాంగ్రెస్ ఎంపీ, విపక్ష నేత రాహుల్ గాంధీ విచారం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు బాసటగా నిలవాలని, సహాయ పునరావాస కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు, వరదలతో సమస్యలు ఎదుర్కొంటున్న తెలంగాణ, ఏపీ ప్రజల బాగోగులపై తాను కలత చెందుతున్నానని, వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు తాను ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు. సహాయ, పునారావస కార్యక్రమాల్లో పాల్గొని బాధితులకు సేవలు అందించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను తాను కోరుతున్నానని చెప్పారు. భారీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని, ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు అలుపెరగకుండా శ్రమిస్తున్నదని చెప్పారు. ఈ విపత్తుతో నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, ఏపీ ప్రభుత్వం తక్షణమే సమగ్ర పునరావాస ప్యాకేజ్‌లను కల్పించాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు ఏపీ ప్రభుత్వానికి తాను విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు.

## అభ్యర్థుల ఎంపికకు కాంగ్రెస్ సీఈసీ భేటీ




ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, సెప్టెంబర్ 2: జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక కసరత్తును వేగవంతం చేసింది. అభ్యర్థుల ఖరారు కోసం సోమవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ అయింది. ఆగస్ట్ 27న 9 మంది అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించగా మిగిలిన స్థానాలపై వడపోతను ముమ్మరం చేసింది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఎన్నికల కమిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. సీఈసీ భేటీ అనంతరం పార్టీ నేత టీఎస్ సింగ్‌దేవ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈరోజు భేటీ 29 అసెంబ్లీ స్థానాలపై చర్చించామని, త్వరలో జాబితా విడుదలవుతుందని చెప్పారు. జమ్ము కశ్మీర్‌లో అన్ని అసెంబ్లీ స్థానాలకూ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశామని కాంగ్రెస్ నేత అంబికా సోనీ వెల్లడించారు.కాగా కాంగ్రెస్ ఇప్పటికే 9 మందితో తొలి జాబితాను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక పార్టీ నేత గులాం అహ్మద్ మిర్ దూరు స్థానం నుంచి పోటీ చేయనుండగా, వికార్ రసూల్ వనీ బనిహాల్ నుంచి బరిలో దిగనున్నారు. పిర్జాద మహ్మద్ సయ్యద్ అనంత్‌నాగ్ నియోజకవర్గం నుంచి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. షేక్ రియాజ్ దోడా నుంచి బరిలో దిగనున్నారు. ట్రాల్ నుంచి సురీందర్ సింగ్ చన్నీని పార్టీ బరిలో నిలిపింది. ఇక అమానుల్లా మంతూ దేవ్సర్ నుంచి, షేక్ జఫరుల్లా ఇందర్‌వల్ నుంచి, నదీం షరీఫ్ భదర్వ నుంచి, దోడా వెస్ట్ నుంచి ప్రదీప్ కుమార్ భగత్ పోటీ చేస్తారు.

## ఛీ.. వీడు అసలు తండ్రేనా.! కూతురికి డ్రింక్ ఇచ్చి అఘాయిత్యం..!



ఇయ్యాల్టి న్యూస్, క్రైం, సెప్టెంబర్ 2: ఆడపిల్లకు రక్షణ అనేదే లేదా? కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి, ఎప్పుడూ రక్షగా ఉంటానని రాఖీ కట్టించుకునే అన్న.. అందరూ మగాళ్లేనా.. బంధాలు, వావి వరుసలు లేవా? ఆడది అయితే చాలా? అది పసిపిల్లా, వృద్ధురాలా, తల్లా, చెల్లా అనేది అవసరం లేదా? కన్నబిడ్డలనే కామంతో చూస్తుంటే.. ఇక బయటివాళ్ల పరిస్థితేంటి? ఆడపిల్లలు మనగలిగేది ఎలా? ఎటు పోతోంది సమాజం? తల్లికి, ఐదేళ్ల బిడ్డకి మత్తుమందు కలిపి ఇచ్చి పసి పిల్లపై అఘాయిత్యానికి పాల్పడితే వాడిని ఏమనాలి? భర్త దారుణాన్ని గమనించిన భార్య పోలీసులను ఆశ్రయించడంతో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది.కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నతండ్రే అయిదేళ్ల కుమార్తెపై పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడిన ఘటన మాచర్లలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన ఓ వ్యక్తి కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. అతడికి వెల్దుర్తి మండలానికి చెందిన మహిళతో ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. రెండేళ్ల కిందట తన మూడేళ్ల పెద్ద కుమార్తెతో భర్త అసభ్యంగా ప్రవర్తిస్తుండటాన్ని భార్య గమనించింది. భర్త తీరుతో వేదనకు గురైంది. మనస్తాపంతో పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది.రెండు నెలల కిందట తాను మారిపోయానని, ఇకపై అలా ప్రవర్తించనని నమ్మబలికి, పెద్ద మనుషుల ద్వారా పంచాయితీ చేయించి భార్యను తిరిగి మాచర్లకు తీసుకొచ్చాడు. అయినా అతడి తీరులో మార్పు రాలేదు. పదిరోజులుగా రాత్రి వేళల్లో అతడు కూల్‌డ్రింక్‌లో మత్తు కలిపి భార్య, కుమార్తెకు తాగిస్తూ వచ్చాడు. ఆపై కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఉదయం వేళల్లో కూతురు మూత్ర విసర్జనకు వెళ్లి బాధతో ఏడుస్తుంటే అనుమానం వచ్చి తల్లి బిడ్డను తీసుకుని వెళ్లి ఆస్పత్రిలో పరీక్షలు చేయించింది. అక్కడి వైద్యులు బాలికపై అత్యాచారం జరిగిందని చెప్పడంతో తీవ్ర ఆవేదనకు గురైంది. తన భర్తే అఘాయిత్యానికి పాల్పడ్డాడని, అతడిని కఠినంగా శిక్షించాలని ఆమె మంగవారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ ప్రభాకరరావు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి డీఎస్పీకి నివేదికలు అందించారు.


## వ్యవసాయానికి టెక్నాలజీ జోడింపు

### రైతాంగం కోసం కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, సెప్టెంబర్ 2: కేంద్ర కేబినెట్ సమావేశం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో దేశ రైతాంగం కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతాంగం కోసం రూ.13,966 కోట్లను కేంద్రం కేటాయించింది. రూ. 2817 కోట్లతో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ఏర్పాటు చేయనుంది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ద్వారా వ్యవసాయానికి టెక్నాలజీని జోడిస్తూ రైతులకు మరింత మేలు చేయాలని కేంద్రం భావిస్తోంది. భవిష్యత్తులో రైతులు లోన్ తీసుకోవడం కేవలం 20 నిమిషాల్లోనే పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందిస్తోంది.రూ. 3979 కోట్లతో ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సెక్యూరిటీ కోసం క్రాప్ సైన్స్ ఏర్పాటు చేయనున్నారు. 2047 నాటికి వాతావరణ పరిస్థితులను తట్టుకునే పంటను పండించేలా రైతులు సిద్ధం చేయనున్నారు. అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ మరింత బలోపేతం చేసేందుకు రూ. 2291 కోట్లతో ప్రణాళిక రూపొందించనున్నారు. ప్రస్తుతం ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు పరిశోధనలు జరగనున్నాయి. రూ. 1702 కోట్లతో పశువులు వాటి ఆరోగ్యం, డైరీ ఉత్పత్తులపై ఫోకస్ చేయనున్నారు.రూ. 860 కోట్లతో హార్టికల్చర్ అభివృద్ధి కోసం కేటాయించారు. దీని ద్వారా రైతుల ఆదాయాన్ని మరింతగా పెంచనున్నారు. కృషి విజ్ఞాన్ కేంద్ర అభివృద్ధి కోసం రూ. 1,202 కోట్లు, నేచురల్ రిసోర్స్ మేనేజ్మెంట్ కోసం రూ.1,115 కోట్ల రూపాయల కేటాయించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందడి.

## నడి రోడ్డు మీద కుర్చీ వేసుకుని కూర్చున్న మందుబాబు.. సీన్ కట్ చేస్తే..?



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 2: ఓ వైపు వర్షం ఏకధాటిగా పడుతుంటే ఓ తాగుబోతు కుర్చీ పట్టుకుని రోడ్డెక్కాడు. అంతేనా.. రోడ్డు మధ్యలో కుర్చీ వేసుకుని, తాపీగా కూర్చున్నాడు. అసలే అది బిజీ రోడ్డాయె. ఇంతలో అటుగా ఓ లారీ వచ్చింది. హారన్ కొట్టినా.. మనోడికి సోయ లేదు. అంతే ఒకేఒక్క డ్యాష్ ఇచ్చాడు. దీంతో కుర్చీతో సహ తాగుబోతు బొక్కబోర్లా పడ్డాడు. కొంచెం అయితే లారీ టైర్ల కింద పడి నుజ్జునుజ్జయ్యేవాడు. త్రుటితో తప్పింకుని ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ విచిత్ర ఘటన ఉత్తర ప్రదేశ్‌లో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్‌లో మద్యం మత్తులో ఉన్న వ్యక్తి భారీ వర్షం కురుస్తున్నా.. లెక్కచేయకుండా రద్దీగా ఉన్న రోడ్డు మధ్యలో కుర్చీ వేసుకుని రిలాక్స్‌గా కూర్చున్నాడు. ఒక లారీ అతడి వెనకే వచ్చింది. తప్పుకొమ్మని హారన్ కొట్టిన సదరు వ్యక్తి మాత్రం నిమ్మలంగా కూర్చున్నాడు. దీంతో ఒళ్లు మండిన లారీ డ్రైవర్ కుర్చీతో సహ ఎగిరిపోయేలా ఢీ కొట్టాడు. అయితే అదృష్టవశాత్తు లారీ టైర్ల కింద కాకుండా పక్కన పడటంతో ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. లారీ ఢీకొట్టడంతో కుర్చీ విరిగింది. దీంతో అతడు రోడ్డుపై పడిపోయాడు. కింద పడిన తర్వాత కూడా అతగాడు లేవకపోవడం మరో విచిత్రం. అలాగే పడిపోయి రోడ్డుపై వచ్చి, పోయే వాహనాలను చూస్తూ ఉన్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్‌లో ఈ సంఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మందుబాబుకు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఇందుకు సంబంధించిన వీడియో క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
మంగళవారం 03 సెప్టెంబర్ 2024



చూసి ముర్వాలే

## పవన్ కు బర్త్‌డే విషెస్.. చిరు, మహేశ్, అల్లు అర్జున్ మొదలుకొని..



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 2: పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సోమవారం (సెప్టెంబర్ 2). ఈ సందర్భంగా అభిమానులతో పాటు సెలబ్రిటీలు పవన్ కు సోషల్ మీడియా వేదికగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ మహేశ్ బాబు మొదలు కొని సినీ రంగంలోని పలువురు నటీనటులు పవన్‌కు బర్త్‌డే విషెస్ తెలియజేశారు. కళ్యాణ్ బాబు%Ô% ప్రతి సంవత్సరం నీకు పుట్టినరోజు వస్తుంటుంది. కానీ, ఈ పుట్టినరోజు మరీ ప్రత్యేకం. ఆంధ్ర ప్రజానీకానికి కావలసిన సమయంలో కావాల్సిన నాయకుడు వాళ్ల జీవితంలో పెను మార్పులు తీసుకురావడానికి వాళ్ల ఇంటి పెద్ద బిడ్డగా వచ్చాడు. రాజకీయాల్లో నీతి, నిజాయితీ, నిలకడ, నిబద్ధత కలిగిన ఒక నాయకుడిగా నిన్ను వాళ్ల జీవితాల్లోకి ఆహ్వానించారు. గుండెల్లో స్థానం ఇచ్చారు. అది సుస్థిరం. ఈ రోజుల్లో నీలాంటి నాయకుడు కావాలి, రావాలి, అద్భుతాలు జరగాలి. అది నువ్వు మాత్రమే చేయగలవు, చేస్తావనే నమ్మకం నాతో పాటు ఆంధ్ర ప్రజలందరికీ ఉంది. పుట్టిన రోజు శుభాకాంక్షలు దీర్ఘాయుష్మాన్ భవ అంటూ చిరంజీవి స్పెషల్ గా బర్త్ డే విషెస్ తెలిపారు.

# ఇంద్రసేనా రెడ్డి వర్సెస్ సమరసింహారెడ్డి

## నేను రెడీ నువ్వు రెడీనా.. బాలయ్యకు చిరు సవాల్..




ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 2: 1974లో తాతమ్మ కల సినిమాతో బాలకృష్ణ సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చారు. దీంతో బాలయ్య సినీ పరిశ్రమలోకి వచ్చి 50 ఏళ్ళు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా తెలుగు సినీ పరిశ్రమలోని అన్ని యూనియన్లు కలిసి నిన్న రాత్రి గ్రాండ్ గా బాలకృష్ణ నట స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించారు. బాలయ్య 50 ఏళ్ళ నట స్వర్ణోత్సవ వేడుకల ఈవెంట్ కి మెగాస్టార్ చిరంజీవితో పాటు వెంకటేష్, శ్రీకాంత్, నాని, ఉపేంద్ర, శివన్న, మోహన్ బాబు, విజయ్ దేవరకొండ, రానా, మంచు మనోజ్, రాఘవేంద్రరావు, బోయపాటి, తమన్.. ఇలా ఎంతోమంది నటీనటులు, డైరెక్టర్స్, సినీ ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఈవెంట్ కి మెగాస్టార్ చిరంజీవి రావడంతో వీరిద్దరూ కలిసి దిగిన వీడియోలు, ఫొటోలు వైరల్ అవడంతో ఈ ఈవెంట్ పై మరింత ఆసక్తి నెలకొంది. ఇక చిరంజీవి కూడా బాలయ్య గురించి మాట్లాడుతూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు కూడా చేసారు. మెగాస్టార్ చిరంజీవి బాలయ్య ఈవెంట్లో మాట్లాడుతూ.. ఫ్యాక్షన్ సినిమాలకు పెట్టింది పేరు బాలకృష్ణ. నా ఇంద్ర సినిమాకు బాలకృష్ణ సమరసింహారెడ్డి సినిమానే స్ఫూర్తి. ఇంద్ర సినిమా నా వద్దకు వచ్చినప్పుడు బాలయ్య లాగా నేను చేయగలనా లేదా అనుకున్నాను. నాకు బాలయ్యతో ఫ్యాక్షన్ సినిమా చేయాలని కోరిక. ఇటీవల సీక్వెల్స్, ప్రీక్వెల్స్, పార్ట్ 2 , 3లు ఇలా వస్తున్నాయి కదా. నేను అందరి ముందు చెప్తున్నాను. ఇంద్రసేనా రెడ్డి, సమరసింహా రెడ్డి క్యారెక్టర్స్ ని పెట్టి ఎవరైనా కథ చేస్తే నేను చేయడానికి రెడీ బాలయ్య నువ్వు రెడీనా అని అడగడంతో బాలయ్య కూడా నేను రెడీ రెడీ అని అన్నారు. అలాగే.. చూసుకోండి మరి బాలయ్య కూడా రెడీ అన్నారు. ఇంద్రసేనా రెడ్డి వర్సెస్ సమరసింహా రెడ్డి క్యారెక్టర్స్ తో కథ ఎవరు తీసుకొస్తారో చూడండి. బోయపాటి కథ రాస్తావా నీకు ఛాలెంజ్. వైవిఎస్ చౌదరి నువ్వు కూడా ట్రై చెయ్.. ఎవరైనా రచయితలు ఈ క్యారెక్టర్స్ తో కథ రాసి తీసుకురండి మేము చేస్తాము అని అన్నారు చిరంజీవి. దీంతో చిరంజీవి బాలకృష్ణ కలిసి నిజంగానే సినిమా చేస్తే బాగుండు, ఆ క్యారెక్టర్స్ తో సినిమా చేస్తే ఇప్పుడు థియేటర్స్ దద్దరిల్లుతాయి అని ఫ్యాన్స్ అంటున్నారు.

### ట్రెడీషనల్? లుక్?లో మత్తెక్కించేలా...

## టాలీవుడ్ చిట్టి ఫరియా అబ్దుల్లా ?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 2: ఫరియా అబ్దుల్లా వైట్ లెహంగాలో లేటెస్ట్ ఫోటోషూట్ చేసింది. ఆ ఫోటోలను ఇన్?స్టా వేదికగా షేర్ చేసి.. ఓ బ్యూటీఫుల్ క్యాప్షన్ ఇచ్చింది.



## ఎరుపు చీరలో మెరిపిస్తూ... ప్రియాంక జవల్కర్..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 2: హీరోయిన్ ప్రియాంక జవల్కర్ చాన్నాళ్లకు ఇలా రెడ్ శారీలో మెరిపిస్తూ అలరిస్తూ తాజా పిక్స్ నే షేర్ చేసింది.





## బాలి ట్రిప్‌లో... గ్లామర్ డోస్ పెంచిన దీప్తి సునయన..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 2: దీప్తి సునయన తన లేటెస్ట్ ఫోటోలను ఇన్?స్టాలో షేర్ చేసింది. దానికి సంబంధించిన హాట్ ఫోటోలను ఇన్?స్టాలో షేర్ చేసింది బ్యూటీ.

## 'కన్నప్ప' నుంచి 'కాలాముఖ'గా అర్పిత్ రంకా ఫస్ట్ లుక్ పోస్టర్



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 2: మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రాబోతోన్న 'కన్నప్ప' నుంచి ప్రతి సోమవారం ఒక అప్డేట్ వదిలారు. సినిమాలోని ప్రతి పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి బజ్ పెంచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు శరత్ కుమార్, మధుబాల, దేవరాజ్, ముఖేష్ రిషి, మంచు అవ్రామ్ పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లను రిలీజ్ చేయగా.. అవన్నీ మంచి హైప్ క్రియేట్ చేశాయి. తాజాగా మరో పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను టీం విడుదల చేసింది.'కన్నప్ప' నుంచి 'కాలాముఖ' పాత్రకు సంబంధించి అర్పిత్ రంకా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. గాంధార దేశం... వాయు లింగం సొంతం చేసుకునే ధ్యేయం... వేలాది మంది రక్తపాతాన్ని చూసే దాహం... అడవిని, అడవి వీరుల్ని సైతం అంతం చేసే క్రూరత్వం అంటూ కాలాముఖ పాత్రకు ఇచ్చిన ఎలివేషన్, పోస్టర్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. ఇప్పటికే 'కన్నప్ప' టీజర్‌తో సినిమా మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయన్న సంగతి తెలిసిందే. విష్ణు మంచు టైటిల్ రోల్‌లో కనిపించనున్న కన్నప్ప అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రాబోతోంది. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్‌లో ఈ సినిమా పాన్ ఇండియా వైడ్‌గా విడుదల కానుంది.



## బికినీలో పాయల్ రాజ్‌పుత్... థాయ్‌లాండ్‌లో హీట్ ఎక్కుతున్న వీధులు

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 2: పాయల్ రాజ్‌పుత్ ఇప్పుడు థాయ్‌లాండ్‌లో ఉన్నారు. ఆ దేశం వెళ్లారంటే సముద్ర తీరంలో షికార్లు చేయకుండా ఉండరు. సముద్రం అంటే బికినీ కంపల్సరీ కదా! ఆ బికినీ ఫోటోలు చూడండి.

PUBLISHED AND PRINTED BUY K.RAKESH. ON BEHALF OF RRR MEDIA ..Editor : **RR RATHNA**, Address.Patel Nagar Chowrastha, Amberpet, Hyderabad,Telangana - 500013.
**RNI NO. T/TG/2024/ 1093** ..Mobile No : 7013794396, 9949152838 ,Website : www.eyyaltynews.comEMAIL ..ramannews9@gmail.com.